# 113. మూర్ఖుడు

ఓసారి ధనికుడైన తమ మిత్రుడ్ని చూడటానికి అతని స్నేహితులు వచ్చారు. నౌకరుని చూసి అడిగారు వాళ్ళు.

"మీ యజమాని ఏం చేస్తున్నాడో చూసి మాకు చెప్పు. దాన్ని బట్టి మేం ఆయన్ని ఇప్పుడే చూడచ్చో లేక తర్వాత రావాలో నిర్ణయించుకుంటాం."

ఆ నౌకరు లోపలకి వెళ్ళి కొద్ది క్షణాల్లో బయటకి వచ్చి చెప్పాడు.

"మా యజమాని గులక రాళ్ళని లెక్క పెట్టుకుని మురిసిపోతున్నాడు."

"ఐతే మేం వచ్చామని ఆయనకి చెప్పు."

నౌకరు చెప్పాక ఆ ధనికుడు బయటకి వస్తే మిత్రులు అడిగారు.

"నీకేమైనా పిచ్చా? గులకరాళ్ళని లెక్క పెట్టుకుని మురిసిపోతున్నావని మీ నౌకరు చెప్పాడేమిటి?"

"ఛీ! నేను నా డబ్బుని లెక్కపెట్టుకుంటున్నాను. వాడు వుత్తి మూర్ఖుడు." చెప్పాడా ధనికుడు.

మరి కొద్ది రోజుల తర్వాత ఇంకోసారి ఆ మిత్రులు వచ్చారు. ఆ నౌకరు ఎదురుపడ్డాడు.

"మీ యజమాని ఏం చేస్తున్నాడో ఈ సారైనా సరిగ్గా చూసి చెప్పు." మిత్రులు కోరారతన్ని.

'అలాగే' అని అతను లోపలకి వెళ్ళి కాసేపట్లో బయటకి వచ్చి చెప్పాడు.

"నా యజమాని తన శత్రువులతో ప్రేమగా కబుర్లు చెప్తున్నాడు."

"ఏమిటి! నీ శత్రువులతో ప్రేమగా కబుర్లాడుతున్నావుట?" ఆ ధనికుడు బయటకి వచ్చాక మిత్రులు అతన్ని ఆశ్చర్యంగా అడిగారు.

"వాడు అలా చెప్పాడా? నేను నా భార్యాపిల్లలతో మాట్లాడుతున్నాను."

కోపం వచ్చి తన స్నేహితుల ముందే అతను తన నౌకరుని పని లోంచి తీసేసాడు. వెళ్ళబోయే ముందు యజమాని ఆ నౌకరుని పిలిచి అతని చేతిలో ఓ ఆటబొమ్మని వుంచి చెప్పాడు.

"నీకన్నా మూర్ఖుడు నీకు తారస పడినప్పుడు ఇది అతనికి ఇవ్వు."

కొన్ని నెలలు గడిచాయి. ఓ రాత్రి ఆ ధనికుడి ఇంట్లో దొంగలు పడి వున్నదంతా దోచుకెళ్ళారు. అడ్డుపడ్డ ఆ ధనికుడి కాళ్ళని విరగ్గొట్టారు. కాళ్ళు లేక కదలలేని స్థితిలోని ఆ దరిద్రుడికి సపర్యలు చేయలేక భార్య, పిల్లలు అతన్ని వదిలి వెళ్ళిపోయారు.

తన యజమానికి కలిగిన దుస్థితి గురించి తెలిసి ఆ నౌకరు ఆయన దగ్గరకి వచ్చాడు.

"గుర్తుందా?నా కన్నా మూర్ఖుడు మీకు ఈ లోకంలో తారసపడితే వాడికి ఇవ్వమని ఓ బొమ్మని ఇచ్చారు నాకు? ఇప్పుడు నాకు అలాంటి మూర్ఖుడు తారసపడ్డాడు."

తన చేతిలోని ఆట బొమ్మని ఆ నౌకరు తన యజమాని చేతిలో వుంచాడు.

"నేనెలా మూర్ఖుడ్ని అయానో కూడా చెప్పు." అడిగాడాయన.

"మీరు లెక్క పెట్టే డబ్బుని నేను గులకరాళ్ళు అంటే మీరు నమ్మలేదు. ఇప్పుడు మిమ్మల్ని ఈ స్థితికి తీసుకువచ్చిన అలాంటి డబ్బుని ప్రేమించిన మీరు మూర్ఖుడు కాదా? అలాగే డబ్బున్నంత కాలం మీ వాళ్ళు అనుకుని మీరు ప్రేమించిన మీ భార్యా పిల్లలు ఆ డబ్బు పోయాక మిమ్మల్ని వదిలి వెళ్ళిపోయారు కదా. వాళ్ళని మీ శత్రువులుగా గుర్తించక ప్రేమించిన మీరు మూర్ఖులు కాదా?"

ఆ యజమానికి తన తప్పు తెలిసివచ్చింది.

"మరి నా భార్య పిల్లల్ని కాక ఎవర్ని ప్రేమించాలి?" అడిగాడాయన.

"భగవంతుడ్ని. మీరు ధనవంతుడైనా, దరిద్రుడైనా; ఆరోగ్యంగా వున్నా, అవకరం కలిగివున్నా తనని ప్రేమించేవారిని ఆయన తిరిగి ప్రేమిస్తాడు."

ఆ యజమానిని దైవ భక్తుడైన ఆ నౌకరు ఆదుకున్నాడు.

## 114. పర్‌ఫెక్షన్

ఓ ధనికుడు తన ఆరేళ్ళ కొడుకుని మానసిక వికలాంగులకి విద్య నేర్పే స్కూల్లో చేర్పించడానికి తీసుకువచ్చాడు. ఆ రాత్రి కొత్త విద్యార్థుల తల్లితండ్రులకి